# లాటరీ

**వి.వి.సుబ్బారావు**

అవధాన్లుగారు రిటయిరయ్యాక ఆరోగ్య వరంలో సెటిలయ్యారు ఆయన సంపూర్ణ నామ ధేయం అగ్నిహోత్రావధాన్లే అయినా సింపుల్‌గా ఏ హెచ్ అవధాన్లు అని పేరుని కత్తిరించుకున్నారు. ఆయన పని చేసింది 'అగ్నిమాపక దళం'లో 'కొంపలార్పడం' ఆయన వృత్తి. చేసినంత కాలం విత్తశుద్ధితో పని చేసారు ఆయనా?– ఆయన నిప్పులాంటి మనిషి గదండీ!" అని అనిపించుకున్నారందరిచేతా

'ఉద్యోగ ధర్మమే నా ఊపిరి– ఆ తర్వాతే పెళ్ళాం– బిడ్డలూ– యితర వ్యాపకాలూను' అని బహిరంగంగా అనేకమార్లు ప్రకటించే వారాయన.అసలు ప్రమాదాలన్నవి– అవి ఏవయినా కానీయండి– ముందుగా చెప్పిరావు గదండీ?'– అందుకనే ఆయన యిల్లు వదిలి వెళ్ళడానికి– తిరిగి యిల్లు చేరడానికి ఓ టైంటేబులంటూ ఏమీ వుండేదికాదు అవధాన్లు గారి ఈ వృత్తి ధర్మం– పాపం ఆయన ఏకైక కుమారరత్నం యాజులు చదువుమీద గట్టి దెబ్బ కొట్టింది యాజులు తల్లి ఒక పాతకాలంనాటి మనిషి కావడంతో – దానికి తగ్గట్టే వాడి చదువంతా వానాకాలంపాలై, నాని– బి ఏ తో ఆగిపోయి, ఇక కదలనని మొరాయించింది

"నేనింక చదవన్నాన్నా! ఏదయినా ఉజ్జోగం చేసుకుంటా'– ఒక శుభ ముహూర్తంలో తండ్రి ముందు కుండ బద్దలు కొట్టి తెగేసి చెప్పేసాడు యాజులు

'విసుత్తపోలేదు అవధాన్లుగారు తన పరపతిని తాకట్టుపెట్టి, సంపాదన ఎరజూపి కొడుక్కి మంచి చదువుని 'కొన' గలిగిన స్థితిలో తానున్నా, అలా 'కొనక', యిక కొడుక్కి చదువు వంట బట్టేలా లేదని గ్రహించినవాడై, తమ ఊళ్ళోనే ఏదో గవర్నమెంటు ఆఫీసులో చిన్న ఉద్యోగం వేయించి– ఆ వెంటనే తమ దగ్గర బంధువుల అమ్మాయిని ముడిపెట్టి– కొడుకుని ఓ యింటివాణ్ణి చేసి 'అమ్మయ్య' అనుకున్నారు అవధాన్లుగారు

యాజులుకి దురభ్యాసాలంటూ ఏంలేవు– ఒక్క ధూమపానం తప్పిస్తే అసలు ఈ అలవాటు అటు తాత గార్నించి తనకి సంక్రమించిందట ఎటొచ్చీ ఆయనేమో 'సీమ సిగార్లని' కాలిస్తే తను ఫిల్టరు సిగరెట్లుతో సరిపెట్టుకున్నాడు

కాల చక్రం తిరుగుతోంది విసుగూ– విరామం లేకుండా ఉద్యోగంలో ఓ మెట్టు ఎక్కి 'సీనియర్ అసిస్టెంటు' అనిపించుకున్నాడు యాజులు సంసారంలో తొలి 'ఇంక్రిమెంటు'ని ప్రసాదించాడా భగవంతుడు!– ఒక 'మగ నలుసుని' వాడికి తండ్రి పేరే పెట్టుకున్నాడు సాంప్రదాయబద్ధంగా కాముని పున్నమినాడు– అదే 'హోలీ' పండుగనాడు పుట్టడం చేతనో యేమిటో అవధాన్లుకి రంగులంటే మహా ఆనందం! రంగు కాగితాలంటేనూ– అందులో పంచరంగుల లాటరీ టిక్కెట్లంటే మరీ చెప్పలేనంత ఇది!

* * * * * *

ఆ రోజు తనకి బాగా జ్ఞాపకం! రాజకీయ నాయకుడెవరో 'జాల్ది తన్నేశాడని చెప్పి, ఆఫీసుకి సెలవిచ్చారు– పడక్కుర్చీలో జార్లబడి పేపరు చూస్తున్న యాజులుకి చటుక్కున ఏదో గుర్తొచ్చి

"ఒరేయ్! అబ్బాయ్!" అంటూ పిలిచాడు కొడుకుని.

"పిల్చావా నాన్నా"– అవధాన్లు ఆల్బంలో రంగు రంగుల బొమ్మల్ని అంటించే కార్యక్రమాన్ని సగంలో ఆపివచ్చి అన్నాడు.

ఆఁ ఆ రవణ షాపుకెళ్ళి ఓ సూపర్‌స్టార్ ఫిల్టరు పేకట్ తీసుకురా ఇదుగో– ఇంద– ఈ ఐదు రూపాయల నోటు తీసుకువెళ్ళు" కొడుక్కి ఆర్డరు జారీ చేసాడు యాజులు

తండ్రి చేతిలోని నోటుని అందుకొని తుర్రుమన్నాడు అవధాన్లు

రవణ కిళ్ళీబడ్డీ పెట్టుకొని సైడ్ బిజినెస్‌లా లాటరీ టిక్కెట్లు, అమ్మకాన్ని చేపట్టాడు, వ్యాపారంలో 'వేన్నీళ్ళకి చన్నీళ్ళు' అవసరాన్ని గ్రహించిన వాడై.

వచ్చిన అవధాన్లను చూసి–

"ఏం బాబూగారూ! బాగా చదువుకొంటున్నారా?" పరామర్శించాడు రవణ.

"ఆ ఆఁ!" అంటూ" ఒక సూపర్‌స్టార్ ఫిల్టరు సిగరెట్లు పెట్టి తెమ్మన్నాడు నాన్న, ఇదుగో ఐదునోటు" అంటూ రవణకి ఐదు రూపాయల నోటు ఇచ్చాడు అవధాన్లు.

సిగరెట్లు యిస్తూ "చిల్లరలేదు బాబుగారూ! ఆ పేకెట్టు నాలుగు రూపాయలు. ఇంకా మీకు నేను రూపాయి యివ్వాలి. దానికి బదులు యిదుగో యీ లాటరి టికెట్టు తీసుకోండి. నాన్నగారికి నేను చెప్పానని చెప్పండి. ఎల్లుండే కల్పతరు బంపర్ డ్రా దాంట్లో మీకు ప్రైజు గారంటీ" అన్నాడు నవ్వుతూ రవణ

జరిగిందంతా తండ్రికి వివరించాడు అవధాన్లు.

ముందా సిగరెట్లు పెట్టిలా యియ్యి. ఆ లాటరీ టిక్కెట్టు నాకెందుగ్గానీ నువ్వే వుంచుకో" అన్నాడు కొడుకుతో.

* * * * * *

అగష్టు 15–

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఎటు చూసినా! లౌడ్‌స్పీకర్లలోంచి దేశభక్తి ప్రసారమవుతోంది– పొంగిపొరే నదిలా పరవళ్ళు త్రొక్కుతూ. ఊరంతా ఒకటే కోలాహలం!! ఆ రోజేనండీ బంపర్ డ్రా. యాజులుకి ఆ ధ్యాసేలేదు. యిక ఎటొచ్చీ తాపత్రయమంతా అవధాన్లదే! మరో మూడు రోజులు గడిచిపోయాయి.

ఆ రోజే పేపర్లో డ్రా ఫలితాలు ప్రకటిస్తారని అవధాన్లు విన్నాడు తెల్లారాక పేపరు రాగానే గమ్మున ప్రక్కింటి శర్మగారింటికి వెళ్ళి

అంకుల్! ఒక్కసారి పేపరిలా యివ్వరూ! ఇప్పుడే పట్టుకొచ్చి యిస్తా మళ్ళీ "

"ఏవోయ్ ఏమిటి సంగతి? ఏవైనా లాటరీ ఛాన్సు గాని తగల బోతోందా ఏమిటి?" సరదాగా నవ్వుతూ పేపరు అవధాన్ల కిచ్చారు శర్మగారు

పేపరందుకొని యింటికొచ్చి బెడ్‌రూంలోకి పోయి తలుపులు దగ్గరగా వేసొచ్చి పేపరుని నేల మీద పరచి పేజీలు తిరగేస్తున్నాడు ఆఁ ఇదిగో మూడో పేజీలో వేసారు ఫలితాలు! వెళ్ళి రవణ తనకి అంటగట్టిన లాటరి టికెట్టుని "జామెట్రీ' బాక్సులోంచి తీసి పట్టుకొచ్చాడు. తన టికెట్టు నెంబరు ఎ వై – 508515 ఎందుకయినా మంచిదిలే అయినా అత్యాశ పనికిరాదంటారుకదా' అనుకొంటూ లిస్టులో దిగువ నుంచి పైకి వెతుకుతున్నాడు నెంబర్లని

కన్సొలేషన్ నెంబర్లలో లేదు తన నెంబరు ఫోరుత్ప్రైజు గెల్చుకున్న నెంబర్లలో కూడాలేదు పోనీ– థర్డ్ ప్రైజు నెంబర్లలో – అక్కడా లేదు. తన పిచ్చిగానీ అసలు ప్రైజుల్ని గెలుచుకునే ముఖాలే వేరు సెకండ్ ప్రైజు లిస్టుకూడా చూసేస్తే యిక పేపరు మడిచేసి యిచ్చెయొచ్చు

రెండవ ప్రైజులు రెండు ఒక్కొక్కటి ఏకంగా ఏభైవేల రూపాయలు ఒకటో నెంబరు ఎ. పి 624324 తన నెంబరే కాదు! రెండో నెంబరు ఎ. వై–ఐదూ– సున్నా– ఎనిమిది– ఐదూ– ఒకటీ– ఐదూ– అమ్మో! తన టికెట్టు నెంబరే అదీ– తన కళ్ళని తనే నమ్మలేక పోతున్నాడు. అవధాన్లు ఒకటే దడ– వళ్ళంతా ముచ్చెమటలు! వెళ్ళి ట్యూబ్‌లైటు వేసి, ఫాన్ ఆన్‌చేసొచ్చి మళ్ళీ– మళ్ళీ చూసాడు సందేహంలేదు. ఆ నెంబరూ, తన టికెట్ నెంబరూ ఒకటే!

నాన్నా" అంటూ ఒక చేత్తో పేపరు, రెండో చేత్తో టిక్కెట్టు తీసుకొని సుడిగాలిలా దూసుకు వెళ్ళాడు అవధాన్లు.

"మన టిక్కెట్టుకి సెకండ్ ప్రైజు వచ్చింది నాన్నా ఏకంగా ఏభైవేల రూపాయలు– తెలుసా" అన్నాడు.


ఆఁ–" విస్తుపోయి క్షణం సేపటికిగానీ తేరుకోలేదు యాజులు "ఏమిట్రా– నువ్వు చెప్పేది నిజమే?'– ఏదీ ఆ పేపరిలా యియ్యి ముందు, నన్ను చూడనీ" అంటూ నెంబరు మరోసారి చూసి నిర్ధారణ చేసుకొని

ఏమేవ్! ఇలారా ఓసారి అర్జంటుగా" అంటూ గట్టిగా భార్య కోసం కేకవేసి.

"మనకి లాటరీలో సెకండ్ ప్రైజొచ్చిందే. ఏభైవేలు అన్నాడు ఆనందంగా, పోపుగరిటితో బయటికి వచ్చిన భార్యామణితో,

"ఏమిట్రా ఆ హడావిడి?" గీస్తున్న గడ్డాని సగంలో ఆపివేస్తూ అన్నారు అవధాన్లుగారు.

"అవున్నాన్నా! మీ మనవడు మొన్న లాటరీ టికెట్టు తెచ్చాడు మన రవణ షాపు నుంచి సిగరెట్లు పేకట్




కోసమని ఐదు రూపాయలు నోటిచ్చి పంపిస్తే చిల్లర లేదంటూ దానికి బదులు ఈ లాటరి టికెట్టు యిచ్చాట్ట. దానికే సెకండు ప్రైజు వచ్చింది." అన్నాడు సంతోషంతో తేలియాడుతూ.

"మన అదృష్టమంతా మన బుజ్జిగాడేనండీ! అందుకే నేనెప్పుడో చెప్పాను పెద్దయ్యాకా వాడు మనలా కాకుండా ఏ లక్షాధికారో అవుతాడని హుఁ! మీకే నా మాటంటే విలువలేకుండా పోయింది 'నీ ముఖంలే' అంటూ కొట్టి పారేసారు. మరి యిప్పుడేమంటారు చెప్పండి?!" అంది యాజులు గారి భార్య కాస్తంత నిష్ఠూరంగాను, మరింత వ్యంగ్యంగానూ.

"ఆఁ ఛాల్లేద్దూ నీవేళాకోళం!" మృదువుగా భార్యని కోప్పడ్డాడు యాజులు.


"కంగ్రాట్యులేషన్స్ యాజులుగారూ! మీరు లాటరీలో ఏకంగా సెకండ్ ప్రైజు కొట్టేసార్ట! ఈ శుభవార్త అప్పుడే ఊరంతా పాకిపోయింది రవణ ఆ దారిన పోయే ప్రతీవాణ్ణి పిలిచి మరీ చెబుతున్నాడు ఈ సంగతి అసలు మొదట్లో ఈ వార్తని మేమూ నమ్మలేక పోయామనుకోండి ఇదుగో- యిక్కడికి వచ్చాకా నిజమని రూఢి అయింది

అది సరేగానీ- ఏమిటి మా అందరికీ ఈ శుభ సందర్భాన 'శాంతి' చేసే ప్రయత్న మేమయినా ఉందాలేదా యింతకీ? ఏమంటావు చెల్లెమ్మా' అంటూ హడావిడి చేసేసారు శర్మగారొచ్చి స్వయంగా అభినందిస్తూ

"దానికేం భాగ్యం అన్నయ్యగారూ!" అంది యాజులుగారి భార్య వినయం ఉట్టిపడుతూ.

అనుకోకుండా తలుపు తట్టిన అదృష్టానికి ఎంతగానో పొంగిపోయారు యింటిల్లిపాదీ. ఆ నోటా, ఆ నోటా ఈ వార్త పాకి ఎందరో హితులూ, శ్రేయోభిలాషులూ స్వయంగావచ్చి అభినందనలతో ముంచెత్తారు యాజుల్ని

# ఈ వేమన పద్యాలు




ఆదికాలములను నల్పుడేమి యెఱుంగు
చెప్పలేడుగాని తప్పుబట్టు
తోయనేర్చు కుక్క దొంతులు చేర్చునా
విశ్వదాభిరామ వినురవేమ

గుక్క తిప్పుకోలేక పోయాడు యాజులు ఆనందంతో తల మునకలవుతూ.

ప్రైజు దబ్బు చేతికందాలంటే ఇంకా టైం పడుతుందట! ఏవేవో చాలా ఫార్మాలిటీలు పూర్తి చేయాల్ట! అందుకని బాంకుకి వెళ్ళి ఓ మూడువేలు ఎక్స్ట్రా చేసి యింటిల్లిపాదికీ బట్టలు తెచ్చాడు. ఇరుగు, పొరుగు వాళ్ళకి పంచడానికి స్వీట్లు తెచ్చాడు. అంతేకాదు ఆఫీసులో కొలీగ్స్‌కి పార్టీ చేసి, తనకి అలవాటు లేకపోయినా మిత్రులకి యథాశక్తి ఔషధ సేవ చేసి వాళ్ళని తృప్తి పరచి తను తృప్తి పొందాడు.

ఆ ఆనందంతో చూస్తుండగానే రెండు రోజులు

## లాటరి

రెండు క్షణాల్లా దొర్లిపోయాయి. జరిగినదంతా ఒక కమ్మని కలేమోనన్న ఆలోచన వచ్చేది యాజులకి ఓసారి. మరుక్షణంలో ఆ ఆలోచన వచ్చినందుకు తనలో తాను నవ్వుకునేవాడు.

* * * * * *

ఆ రోజు–

అవధాన్లు వరండాలో పడకుర్చీలో జార్లబడి పేపరు తిరగేస్తుంటే– అతని చూపులు అలా వచ్చి, వచ్చి ప్ర[illegible]ల కాలమ్ దగ్గర ఆగాయి కాకతాళీయంగా.

"15-8-85న జరిగిన కల్పతరు బంపర్ డ్రా నెంబరు 148 లో ద్వితీయ బహుమతిని గెలుచుకున్న నెంబరు ఎవై–508515కి బదులుగా ఎ. వై-505815గా సవరించి చదువుకొన వలసిందిగా మనవి."

ప్రకటనని చూసీ చూడగానే అవధాన్లు చూపులు వెర్రి చూపులుగా మారిపోవడం జరిగింది.

వాయువేగాన్ని మించినది మనోవేగమని చెబుతారు! మరి ఆ మనోవేగాన్ని కూడా అధిగమించి లిప్తకాలం కంటె యింకా తక్కువ వ్యవధిలో ఈదుర్వార్త ఊరంతా వ్యాపించింది దావానంలా!

"సుఖాన ఉన్న ప్రాణం దుఃఖాన పెట్టుకున్నట్లైనదండీ!" అంది యాజులు భార్య కడుపులో అగ్ని గోళాన్ని దాచుకొని!

"అసలు నేను చెప్తే విన్నావుటే! అక్కడికి నీకొడుకేదో గొప్ప ప్రయోజకుడయినట్లు మాట్లాడి వాణ్ని వెనకేసుకొచ్చావే! వాడిలా చదువు, సంధ్యా లేకుండా లాటరీ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నాడంటే అందుక్కారణం నువు చేస్తున్న గారాబం కాదూ?" అన్నాడు కస్సుమంటూ లేచిన యాజులు. భార్యమీదఉన్న అక్కసునంతా పైకి వెళ్ళగ్రక్కుతూ.

అంత క్రితం అడుగడుగునా అభినందనలను అందజేయడానికి స్వయంగా వచ్చిన శ్రేయోభిలాషుల్లో ఏ ఒక్కరూ ఈ సారి ఈ కష్టసమయంలో వచ్చి కనీసం "అయ్యోపాపం!" అన్న సానుభూతిని అందజేయడానికి కూడా 'సాహసించలేకపోయారు. అవును మరి! "నీ సుఖాన్ని నలుగురితో పంచుకో, నీ దుఃఖాన్ని నీలోనే దాచుకో" అని ఉండనే ఉంది పెద్దల మాట! కాగా, పాపం! పైకి వ్యక్తం చెయ్యలేకపోయినా, అడుగున గుండె పొరలలో సానుభూతిని గూడుకట్టుకునే ఉండాలి తన శ్రేయోభిలాషులందరికీ" అనుకున్నాడు యాజులు, వాళ్ళని తప్పుబట్టడం ధర్మం కాదు గనుక.

అవధాన్లు గారికి లోపల సాగర మథనం" జరుగుతూనే వున్నా, పైకి మాత్రం చాలా గంభీరంగా ఉన్నారు.

"చూడు యాజులూ! జరినదానికి మనం చింతించి ఏం ప్రయోజనం? అంతా విధిలిఖితం! ఎలా రాసి పెట్టి ఉందో అలా జరక్క మానదు. మనం కేవలం నిమిత్త మాత్రులం. అంతే!" అంటూ పైకి వేదాంత బోధ చేసారు.

అవును మరి! మంట లార్పడం వృత్తిరీత్యా అవధాన్లుగారు సర్వీసులో ఉండగా అవలీలగా చేసిన పనే కావచ్చు! కానీ మరి ఈ నాడు! తన వాళ్ళ గుండెల్లోని 'కార్చిచ్చు'ని ఆర్పాలంటే పాపం– ఆయనకి సాధ్య పడిందికాదు, ఎంత ప్రయత్నం చేసినాగానీ! మూడు వేలూ పోతే పోయాయిగానీ, చివరకు ఆ దబ్బుతో కొనుక్కున్న అవమానం మాత్రమే మిగిలింది పాపం యాజులుగారికి– ఆయన కుటుంబానికీ! □